క్లుప్తంగా

విరాళం అందజేత

సంగెం : మండలంలోని కాట్రపల్లిలో ఆంజనేయస్వామి, పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఊకల్ నాగేంద్రస్వామి దేవాలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్షలు రూ.21వేలు విరాళం అందజేశారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీవరకు విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన చైర్మన్ గోగుల రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్సంగ్ భక్తులు వనమారెడ్డి, సుదన్‌రెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

బాధితులకు బియ్యం..

పర్వతగిరి : మండలంలోని జమాల్‌పురం గ్రామానికి చెందిన దుడ్డు యాకమ్మ కుమారుడు ఇటీవల మృతి చెందాడు. కాగా, యంగ్ స్టార్ యూత్ సభ్యులు మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి 50కేజీల బియ్యం అందజేశారు.

మండల కమిటీ ఎన్నిక


సర్వేశం, అధ్యక్షుడు

నల్లబెల్లి : తెలంగాణ ఆటో యూనియన్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు బసవరాజుల శ్రీను తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం సంఘం సమావేశంలో కమిటీ అధ్యక్షుడిగా బోల్లోనిపల్లి గ్రామానికి చెందిన బోళ్ల సర్వేశం, ఉపాధ్యక్షుడిగా గుడిశాల నరేశ్, కార్యదర్శిగా తిప్పని సంపత్, కోశాధికారిగా మొగిలి, సహాయ కార్యదర్శిగా నదునూరి మహేందర్ ఎన్నికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్వేశం మాట్లాడుతూ.. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు.

ఏఓగా బానోత్ మాధవి



దుగ్గొండి : మండల వ్యవసాయ అధికారిగా బానోత్ మాధవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఏఓ దయాకర్ వరంగల్ డీఏఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వరంగల్ వ్యవసాయ శిక్షణ కేంద్రంలో ఏఓగా పనిచేస్తున్న మాధవి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు ఇస్తామన్నారు.అర్హత ఉండి రుణమాఫీ జాబితాలో పేరు రాని రైతులు తమను సంప్రదించాలన్నారు.

వర్ధన్నపేట ఏఓగా విజయకుమార్



వర్ధన్నపేట : మండల వ్యవసాయ అధికారిగా (ఏఓ)గా విజయకుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించిన సాగరిక (టెక్నికల్ ఏఓ) వరంగల్‌లోని సొంత కార్యాలయానికి వెళ్లారు.

ఏఈఓలుగా బాధ్యతలు

ఖానాపురం : మండలంలోని వ్యవసాయ శాఖలో పని చేస్తున్న ఏఈఓలు బదిలీ అయ్యారు. ధర్మరావుపేట క్లస్టర్ పరిధిలో పని చేస్తున్న ఏఈఓ సంతోష్, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం కాకరవాయి క్లస్టర్‌కు, ఖానాపురం ఏఈఓ సంధ్య.. నర్సంపేట మండలంలోని లక్నెపల్లి క్లస్టర్‌కు బదిలీ అయ్యారు. వీరి స్థానాల్లో ధర్మరావుపేట క్లస్టర్‌కు చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి క్లస్టర్‌కు చెందిన మహ్మద్ అంకుషావలీ (85009 97435), ఖానాపురం క్లస్టర్‌కు భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ క్లస్టర్‌కు చెందిన ఆశాదీప్(78159 10929)లు విధుల్లో చేరినట్లు ఏఓ శ్రీనివాస్ తెలిపారు.

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి, అమీనాబాద్, చెన్నారావుపేట, జల్లీ క్లస్టర్లలో బదిలీపై వచ్చిన ఏఈఓలు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఉప్పరపల్లి ఏఈఓగా శశికాంత్, జల్లీ ఏఈఓగా కళ్యాణి, చెన్నారావుపేట ఏఈఓగా నాగరాణి, అమీనాబాద్ ఏఈఓగా కిరణ్మయి బాధ్యతలు స్వీకరించారు.

మాకు న్యాయం చేయండి

- గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసితుల విజ్ఞప్తి
- రైతులకు మేలు జరిగేలా చూస్తా..
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి


ఎమ్మెల్యే రేవూరికి సమస్యలను వివరిస్తున్న రైతు రాజగోపాల్‌రావు


పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానంటున్న రైతు చల్లా రవి

గీసుకొండ: గీసుకొండ, సంగెం మండలాల్లోని 9 గ్రామాల నుంచి 25 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే కింద 106 హెక్టార్ల భూమి కోల్పోతున్న తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని భూ నిర్వాసితులు తమ గోడు వినిపించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే కింద భూములు కోల్పోతున్న రెండు మండలాల రైతులతో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ భూ సేకరణ ఎవరూ ఆపలేరని, అలైన్‌మెంట్‌ను మార్చడం సాధ్యం కాదని, రైతులకు రావాల్సిన పరిహారం, నిర్ణయించిన ధర కంటే 85 నుంచి 100 శాతం ఎక్కువగా వచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భూమికి బదులుగా భూమి ఇవ్వడం కుదరదని, రైతులకు న్యాయం చేయాలనే ఆలోచనతో సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారన్నారు. త్వరలో మరోమారు సమావేశం నిర్వహించి రైతుల సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని అన్నారు. రైతులు తిమ్మాపురం రాజగోపాల్‌రావు, పెండ్లి చిన్నమల్లారెడ్డి, మేకల సారయ్య, కొత్త కుమారస్వామితో పాటు పలువురు రైతులు సమస్యలను వివరించారు. కాగా, గంగదేవిపల్లి గ్రామానికి చెందిన చల్లా రవి అనే రైతు తన ఎకరం 19 గుంటల భూమి మొత్తం హైవే కింద పోతోందని, బిడ్డకు ఏం ఇచ్చి పెళ్లి చేయాలని, కుమారుడికి భూమి ఏం ఇవ్వాలని ప్రశ్నించాడు. ఆత్మహత్య చేసుకుంటానని పురుగుల మందు డబ్బా చూపించడంతో పక్కన ఉన్న వారు లాక్కున్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అతడిని సముదాయించాడు. ఆత్మహత్య సమస్య పరిష్కారానికి మార్గం కాదన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ ఆర్డీఓ కృష్ణవేణి , రెండు మండలాల తహసీల్దార్లు రియాజుద్దీన్, రాజ్‌కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల డిమాండ్లు..

- కోల్పోతున్న భూమికి బదులుగా భూమి ఇవ్వాలి.
- లేదంటే మార్కెట్ ధర చెల్లించాలి.
- భూమి కోల్పోతున్న వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి.
- హైవే అండర్‌పాస్‌లను ఎత్తులో, వెడల్పుగా నిర్మించాలి.
- హైవేకు ఇరువైపులా సర్వీస్ రోడ్లను నిర్మించాలి.
- బావులు, బోరు బావులు, పైపులైన్‌ను కోల్పోతున్న వారికి అదనపు పరిహారం ఇవ్వాలి.
- సీఎం ను కలిసి సమస్య విన్నవించడానికి అవకాశం కల్పించాలి.
- టోల్‌గేట్ వసూళ్లలో రైతులను భాగస్వాములను చే యాలి.
- హైవే ప్రాజెక్టు డైరెక్టర్ రైతులకు హామీపత్రం ఇవ్వాలి.
- 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలి.
- కూతుళ్లకు కట్నంగా ఇచ్చిన భూమి హైవే కింద పోతే ప్రత్యేకంగా చూడాలి.

అందరికీ సంక్షేమ పథకాలు


గీసుకొండ: చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి తదితరులు

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన వారికి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొనాయమాకులలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. గీసుకొండ, సంగెం మండలాలకు చెందిన 36 మందికి కల్యాణలక్ష్మి, 49 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. ఆర్డీఓ కృష్ణవేణి, తహసీల్దార్లు రియాజుద్దీన్, రాజ్‌కుమార్, మాజీ ఎంపీపీ బీమగాని సౌజన్య, కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, దుపాకి సంతోష్, వీరగోని రాజ్‌కుమార్, రడం శ్రీధర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెన్నారావుపేట: చెక్కు అందజేస్తున్న నాయకులు

చెన్నారావుపేట : మండలంలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు తాళ్లపల్లి నర్సయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చింతకాయల చంద్రమోగిళి, గుంజె సారమ్మ, నరిగె సరిత, బొనగాల శ్రీలత, ఎడ్ల రమేష్, ఎదురబోయిన విజయ, దొంతి సుమన్, భద్రమ్మ, బుజ్జమ్మ, సాల్కిలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో నన్నెబోయిన రమేష్, కోరె కుమారస్వామి, మేకల నర్సయ్య, ఈర్య నాయక్, బొంత శ్రీను, కుండె కుమారస్వామి, జంగిలి సమ్మయ్య, మెంతుల రమేష్, జోరు వీరయ్య, ప్రతాప్‌రెడ్డి, తోట రాము తదితరులు ఉన్నారు.

దాడిచేసిన వారిని శిక్షించాలి

నర్సంపేట రూరల్ : ఆస్పత్రిలో గొడవపడి తమ సిబ్బందిపై దాడిచేసిన వారిని శిక్షించాలని న్యూ అమ్మ ఆస్పత్రి వైద్యాధికారి హిమాబిందు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా హిమబిందు మాట్లాడుతూ.. అంగోత్ నీల కాలు విరగగా ఈనెల 19వ తేదీ రాత్రి ధరావత్ రమణి, ధరావత్ నవీన్, అంగోత్ వంశీ, అంగోత్ స్వామి అనే వ్యక్తులు తమ ఆస్పత్రికి తీసుకొచ్చారన్నారు..పేషెంట్ రావడంతో అవసరమైన చికిత్స అందించామని, అదే సమయంలో కుటుంబ సభ్యులు గొడవకు దిగి ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. ఇది గమనించిన ఆస్పత్రి సిబ్బంది వద్దని వారించేందుకు వెళ్లగా కొడగాని కల్యాణ్‌పై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. దాడి చేసిన వారంతా చెన్నారావుపేట మండలంలోని సూర్యపేటతండా, అడ్డబాట తండాకు చెందిన వారని, వారిపై చర్యలు తీసుకోవాలని హిమబిందు పోలీసులను కోరారు. అదే విధంగా నర్సంపేట ఐఎంఏ అధ్యక్షుడు జయుడు మాట్లాడుతూ.. కొద్దిరోజులుగా పలుచోట్ల ఆస్పత్రులపై, సిబ్బందిపై రోగులు, బంధువులు వివిధ కారణాలతో దాడులు చేస్తున్నారని, ఈక్రమంలో న్యూ అమ్మ ఆస్పత్రి సిబ్బందిపై రోగి బంధువులు దాడి చేయడం జరిగిందని, తక్షణమే ప్రైవేట్ ఆస్పత్రులకు రక్షణ కల్పించాలని కోరారు. దాడి చేసిన వారిని శిక్షించాలని కోరుతూ నర్సంపేట ఐఎంఏ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు షురూ


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

ఖానాపురం : మండలంలోని బండమీది మామిడి తండా గ్రామ పంచాయతీ పరిధిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మూడ్రోజుల పాటు ప్రతిష్ఠాపన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు విశ్వక్సేన పూజ, గ్రామ దేవతల అవాహనం , తోరణ బంధనం, పుణ్యహావచనము, అఖండ ప్రతిష్ట, దీక్షా కంకణధారణ, అగ్ని ప్రతిష్ఠ హోమం చేశారు. బుధ, గురువారాల్లోనూ పూజా కార్యక్రమాలను కొనసాగనున్నాయి.

సేవ ముసుగులో రామ్మోహన్‌రావు దోపిడీ

- కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌రావు

పర్వతగిరి: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అండతో కల్లెడకు చెందిన ఎర్రబెల్లి రామ్మోహన్ రావు సేవ ముసుగులో దోపిడీ చేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు ఆరోపించారు. మంగళవారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు కాకతీయ ఉప కాల్వ, డీబీఎం-48ను తొలగించి రెండు ఎకరాలకుపైగా భూమి కబ్జా చేశాడని, అదే గ్రామానికి చెందిన దళితులు, బీసీలకు కేటాయించిన సుమారు 40 ఎకరాల అసైన్డ్ భూమిని ధరణిలో లొసుగులను ఆసరాగా చేసుకొని అప్పటి అధికారుల అండదండలతో కబ్జా చేశారని విమర్శించారు. పర్వతగిరిలో కాకతీయుల కాలంలో నిర్మించిన పురాతన శివాలయాన్ని కూల్చివేశారని తెలిపారు. సామాన్యులు కూల్చివేస్తే గుప్తనిధుల పేరుతో తవ్వకాలు చేపడుతున్నారని కేసులు నమోదు చేస్తారని, వీరిపై అధికారులు ఎందుకు కేసులు నమోదు చేయలేదని ప్రశ్నించారు. పర్వతగిరి గుట్టపై శివాలయాన్ని స్వచ్ఛందంగా తానే నిర్మించినట్లు తెలిపి సుమారు మూడు కోట్ల రూపాయల ప్రభుత్వ ధనాన్ని ఖర్చు చేశారని ఆధారాలతో నిరూపించారు. స్వచ్ఛంద సంస్థ పేరుతో కోటి రూపాయల వరకు వసూలు చేశారని అనిల్‌రావు విమర్శించారు.

ఎర్రబెల్లి దయాకర్‌రావు సైతం..

మంత్రిగా పనిచేసిన కాలంలో ఎర్రబెల్లి దయాకర్ రావు తన బినామీ చిదురాల చంద్రశేఖర్ పేరుతో రూ.3 కోట్ల విలువ చేసే సృజన కారంపొడి మిల్లును రూ.40 లక్షలకే దయాకర్‌రావు లాగేసుకున్నాడని ఆరోపించారు. తదుపరి చంద్రశేఖర్ నుంచి ఎర్రబెల్లి దయాకర్‌రావు తన కుమారుడు ప్రేమ్‌చందర్‌రావు పేరు మీద సృజన కారంపొడి మిల్లు స్థలాన్ని రిజిస్టర్ చేసుకున్నట్లు సాక్ష్యాధారాలతో నిరూపించారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, మాజీ ఎంపీటీసీ బొట్ల మహేంద్ర, మాజీ ఉపసర్పంచ్ రంగు జనార్దన్‌గౌడ్, నాయకులు వంగాల రవీందర్, ముదురుకోళ్ల రమేశ్, సైదులు, రమేశ్, ప్రసాద్, చల్ల వెంకన్న పాల్గొన్నారు.

యూత్ స్పోర్ట్స్ మీట్‌కు విద్యార్థి ఎంపిక


ఉదయ్‌ని అభినందిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట రూరల్ : అంతర్జాతీయ యూత్ స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికైన విద్యార్థి ఉదయ్‌ని హనుమకొండలోని తన స్వగృహంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మంగళవారం అభినందించారు. ఇటీవల గోవాలో జరిగిన జాతీయ స్థాయి యూత్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ గేమ్ చాంపియన్ లాంగ్ జంప్ పోటీల్లో నర్సంపేట మండలం ఇప్పల్‌తండాకు చెందిన విద్యార్థి ఉదయ్ అత్యంత ప్రతిభ కనబర్చి బంగారు పతకాన్ని సాధించాడు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు నేపాల్‌లోని పోకారా పట్టణంలో జరిగే అంతర్జాతీయ యూత్ గేమ్స్ చాంపియన్ షిప్ ఉదయ్ పాల్గొననున్నారు. ఈక్రీడల్లో భారత్ తరుపున పాల్గొన బోయే ఉదయ్‌ను అభిందించిన ఎమ్మెల్యే రూ.10వేలు ఆర్థిక సాయం అందించి నేపాల్‌లో జరిగే పోటీలకు వెళ్లేందుకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కాంపెల్లి విజేందర్‌రెడ్డి, మైబు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని రైతు వేదికలో నేడు(బుధవారం) ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యురాలు సరోజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్థికసాయం



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మాధన్నపేట గ్రామానికి చెందిన గొర్రె శారదకు చెందిన ఇల్లు ఇటీవల షాట్‌సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. కాగా, బాధిత కుటుంబానికి పోచమ్మ యూత్ క్లబ్, కడారి కుమారస్వామి ఆధ్వర్యంలో రూ.5,500 నగదు అందజేశారు.

సలహాల పెట్టె ఏర్పాటు



దుగ్గొండి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన ఆవిష్కరణలు, ఆలోచనలను తెలిపేందుకు మంగళవారం సలహాల పెట్టెను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా హెచ్‌ఎం రామస్వామి మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని నూతన ఆలోచనలను వెలికితీయడానికి సలహాల పెట్టె ఉపయోగపడుతుందన్నారు. నేటి మాట, సూక్తులు ఇలా విద్యార్థులకు ఎలాంటి ఆలోచనలు వచ్చిన రాతపూర్వకంగా రాసి తెలియజేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుశీల, విజయలక్ష్మి, అహ్మద్, అజీజ్, రజిని, జుమ్మిలాల్, అరుణ, సంధ్యారాణి, మహేష్, మధుసూదన్, ఐలయ్య పాల్గొన్నారు.

నర్సంపేట: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


వర్ధన్నపేట: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సురేష్


రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

మాజీ ప్రధాని, దివంగత నేత రాజీవ్‌గాంధీ దేశాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. జిల్లావ్యాప్తంగా మంగళవారం రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు కాంగ్రెస్ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐటీ రంగానికి పునాదులు వేసిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందన్నారు. రాజీవ్‌గాంధీ స్ఫూర్తితో నేటితరం యువత శాస్త్రవేత్తలుగా ఎదగాలని వారు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **- సాక్షి నెట్‌వర్క్**


నెక్కొండ: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు


గీసుకొండ: రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి


పర్వతగిరి: నివాళులర్పిస్తున్న నాయకులు


సంగెం: పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు


దుగ్గొండిలో..


చెన్నారావుపేటలో..

శ్మశాన వాటికలో సౌకర్యాలేవి?

- స్నానం చేసేందుకు నీటి వసతి కరువు
- విద్యుత్ సరఫరా లేక స్థానికుల అవస్థలు


పర్వతగిరిలో నీటి వసతిలేక వృథాగా మారిన నల్లాలు

పర్వతగిరి : మనిషి మరణానంతరం దహన సంస్కారాలకు ఎలాంటి లోటుపాట్లు రాకుండా ఉండేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతీ గ్రామంలో శ్మశాన వాటిక నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా పర్వతగిరి మండలంలో మొత్తం 33 గ్రామ పంచాయతీలకు 33 శ్మశాన వాటికలు నిర్మించారు. కాగా శ్మశాన వాటికలను గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అయితే వాటి పర్యవేక్షణ లేక మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీల్లో నిర్మించిన శ్మశాన వాటికల్లో చెత్తా చెదారం పేరుకుపోయాయి. మరికొన్ని గ్రామాల్లోని శ్మశాన వాటికల్లో దహన సంస్కారం అనంతరం స్నానాలు చేసేందుకు నీటి వసతి లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. అలగే మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేసిన వాటి నిర్వహణ లోపంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా కొన్ని శ్మశాన వాటికల్లో విద్యుత్ అంతరాయంతో రాత్రి వేళల్లో దహన సంస్కారాలు చేసేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శ్మశాన వాటికల్లో మౌళిక సదుపాయాల కల్పనతో పాటు నిర్వహణను సక్రమంగా చేపట్టాలని కోరుతున్నారు.


పిచ్చి మొక్కలతో నిండిన నారాయణపురం శ్మశాన వాటిక

నీటి వసతి ఏర్పాటు చేయాలి



పర్వతగిరి శ్మశానవాటికలో స్నానం చేసేందుకు నీరు లేక మహిళలు, పురుషులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ అంతరాయంతో అవస్థలు తప్పడం లేదు. అధికారులు చొరవ చూపి శ్మశాన వాటికలో నీటి వసతిని కల్పించాలి. - కక్కెర్ల యాకాంబ్రం, పర్వతగిరి

ప్రత్యేక చర్యలు తీసుకుంటాం



శ్మశాన వాటికల్లో సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా శ్మశాన వాటికల్లో పిచ్చి మొక్కలను తొలగిస్తున్నాం. స్నానం చేసేందుకు నీటి వసతి, విద్యుత్ సరఫరా తదితర సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతాం. - మాలోత్ శంకర్, ఎంపీడీఓ

'నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలి'

పర్వతగిరి : కొల్లూరి రేవంత్ కుమార్ మృతిపై పోలీసులు జాప్యం చేయకుండా నిందితులను వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. మండల కేంద్రానికి చెందిన కొల్లూరి రేవంత్‌కుమార్ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో జూన్ 8వ తేదీన అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు జాప్యం చేయకుండా విచారించి నిందితులను గుర్తించాలన్నారు. ఈ మేరకు రేవంత్ కుమార్ తండ్రి కొల్లూరి నాగరాజు తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని, విచారణ చేసి న్యాయం చేయాలని బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికి ఎలాంటి విచారణ జరుపకుండా జాప్యం చేస్తున్నారని నర్సయ్య తెలిపారు. ఈ సంఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి తక్షణమే నిందితులను గుర్తించే విధంగా పోలీస్ శాఖకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోరారు.